సాక్షి
చిత్తూరు
శనివారం। 30। నవంబర్। 2024



వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

ట్రాన్స్‌ఫార్మర్లతో షాక్‌కు గురై వన్యప్రాణులు మృతి చెందకుండా వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. - 8లో



మా కడుపు కొట్టారు!

తమ దుకాణాలు కూల్చి, భవనాలు కట్టి ఇతరులకిచ్చి, తమ కడుపు కొట్టారని బోయకొండ చిరువ్యాపారులు అన్నారు. - 8లో

హలో.. గంజాయి ఎంత కావాలి?



ఎన్ని కిలోల గంజాయి కావాలని పోలీసులనే ఓ గంజాయి స్మగ్లర్ అడగడంతో పోలీసులు నోరెళ్లబెట్టారు. ఈ సంఘటన చిత్తూరులో జరిగింది. అలాగే గంజాయి కేసులో ఓ నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

వరసిద్ధుడి సేవలో సీసీఎల్‌ఏ కమిషనర్ ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీ ముత్యాల రాజుకు చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారులు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారిని శుక్రవారం సీసీఎల్‌ఏ కమిషనర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముత్యాలరాజు దర్శించుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆలయాధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ప్రిన్సిపల్ సెక్రటరీతోపాటు కలెక్టర్‌కు ఆశీర్వచనం పలికి, స్వామి ప్రసాదం అందజేశారు.

కాణిపాకం ఈఓగా పెంచలకిషోర్



చిత్తూరు కలెక్టరేట్/ కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఈఓగా పెంచల కిషోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ఈయనకు పోస్టింగ్ ఇచ్చింది.

పకడ్బందీగా క్యాన్సర్ స్క్రీనింగ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): క్యాన్సర్ స్క్రీనింగ్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సర్వేని బాధ్యతగా చేయాలన్నారు. బీపీ, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, థైరాయిడ్, పక్షవాతం, క్యాన్సర్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ తదితరాలను గుర్తించాలన్నారు.

ఏడీగా రంగస్వామి

చిత్తూరు కలెక్టరేట్: డీఈఓ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్‌గా రంగస్వామిని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం పెనుగొండ డీవైఈఓగా పనిచేస్తున్న ఆయన్ని డీఈఓ కార్యాలయం ఏడీగా నియమించినట్లు పేర్కొన్నారు.

ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా కరుణకుమారి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా కరుణకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి కలెక్టరేట్‌లోని ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

గొంతు తడవనీరు

రూ.కోట్లు ఖర్చు.. కిలో మీటర్ల కొద్దీ ఆగిన పైపులైన్ పనులు.. వృథాగా పైపులు.. పెండింగ్‌లో జాతీయ రహదారి కటింగ్‌కు అనుమతులు.. ప్రారంభం కాని కైలాసపురం వాటర్ ట్యాంకు నిర్మాణం.. దిష్టిబొమ్మలా అడవిపల్లె రిజర్వాయర్‌లో ఇన్‌టేక్ వెల్.. ఇదీ అడవిపల్లె రిజర్వాయర్ ప్రాజెక్టు దుస్థితి. చిత్తూరు నగరానికి తాగునీరందించాలన్న సదాశయంతో ఈ పథకం ప్రారంభించారు. అయితే కూటమి పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలక్ష్యం.. జనానికి కన్నీటి కష్టం మిగలనుంది. అయినా 2025 నాటికి నీరిచ్చేస్తామని కూటమి సర్కారు జీఓ లిచ్చి ప్రగల్భాలు పలుకుతోంది. ఇదేమి చోద్యం అని ప్రజలు విస్తుపోతున్నారు.





పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ వద్ద మట్టికొట్టుకుపోయిన పైపులైన్లు



నిరీక్షణ..!

- చిత్తూరు తాగునీటి పథకం పనుల్లో నిర్లిప్తత
- అడవిపల్లె రిజర్వాయర్ నుంచి నీళ్లు ఎప్పటికో..?
- పూతలపట్టు వద్ద రోడ్డు కట్టింగ్ అనుమతుల ఎక్కడ..?
- దామలచెరువు వద్ద పూర్తి కాని నీటిశుద్ధి కేంద్రం నిర్మాణం
- అడవిపల్లె రిజర్వాయర్‌లో ప్రారంభం కాని ఇన్‌టేక్ వెల్
- చిత్తూరు కార్పొరేషన్‌పై నెలకు రూ.కోటి భారం
- పూర్తి కాని పనులకు కాగితాల్లో అనుమతులు



చిత్తూరు అర్బన్: అడవిపల్లె రిజర్వాయర్.. చిత్తూరు నగర వాసులు గొంతు తడుపుకోవడానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న బృహత్తర ప్రాజెక్టు. అయితే చిత్తూరు ప్రజలకు శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చేపట్టిన పనులు స్తంభించిపోయాయి. పూర్తికాని పనులకు కూటమి ప్రభుత్వం కాగితాల్లో నీటిని తీసుకొస్తామని అనుమతులు కూడా ఇచ్చేసింది. మరి క్షేత్రస్థాయిలో ఆగిపోయిన పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు? చిత్తూరుకు తాగునీరు ఎప్పుడు అందుతుంది? సాంకేతిక అనుమతుల కోసం ఆగిపోయిన ఫైళ్లకు ప్రాణం ఎప్పుడు పోస్తారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ఎవరి వద్ద సమాధానాలు లేవు.

రోడ్డు కటింగ్ ఫైల్ పెండింగ్

అడవిపల్లె నుంచి మొదలైన పైపులైను పనులు పూతలపట్టు సమీపంలోని రంగంపేట కూడలి వద్ద ఆగిపోయాయి. జాతీయ రహదారిపై రోడ్డు కట్ చేసి అందులో పైపులు పెట్టాల్సి ఉంది. ఇందుకు ఎన్‌హెచ్ అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఫైలు పెండింగ్‌లో పడింది. ఇక దామలచెరువు సమీపంలోని పుదిపట్లబైలు సమీపంలో 37 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఇక్కడ దాదాపు 50 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది కాకుండా రిజర్వాయ్‌లోపలే ఇన్‌టేక్ వెల్ (బావి)ను నిర్మించాల్సి ఉంది. ఆ పనులు అసలు మొదలు కూడా పెట్టలేదు.

కదిలేది ఎప్పుడు..?

2046వ సంవత్సరానికి చిత్తూరు నగర జనాభా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ప్రాజెక్టు పనులు మొత్తం 92 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. కేవీ పల్లె, పీలేరు, పాటూరు, దామలచెరువు, కల్లూరు, పూతలపట్టు, కట్టమంచి, చిత్తూరు, దుర్గానగర్ కాలనీ వరకు పైపులైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 66 కిలో మీటర్ల దూరం మాత్రమే పైపులైన్ పనులు పూర్తయ్యాయి. ఇంకా 26 కిలోమీటర్ల దూరం పైపులైన్ పనులు పూర్తి కావాల్సి ఉంది.

మౌనం వీడితేనే..

పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అధికారులు మౌనం వీడాల్సి ఉంది. రోడ్డు కటింగ్ కోసం ఎన్‌హెచ్ అధికారుల వద్ద ఆగిన ఫైలును బూజు దులిపితే కనీసం పైపులైన పనులు పునఃప్రారంభించవచ్చు. పనుల ప్రారంభానికి ముందే కాంట్రాక్టర్‌కు రూ.160 కోట్లు విడుదల చేసిన టీడీపీ ప్రభుత్వం.. పనులు ఎందుకు నెమ్మదించాయని నిలదీయాల్సి ఉంది. పబ్లిక్ హెల్త్, ఎన్‌హెచ్ శాఖలకు చెందిన అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి.. ఆగిన ఫైలుకు పునరుజ్జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇవన్నీ ఏమీ పట్టించుకోకుండా తాంబూాలిచ్చేశాం.. తన్నుకుచావండి అన్న చందంగా జీఓ ఇచ్చేశాం, ఇక మాకేం సంబంధంలేదని కూటమి సర్కారు మిన్నకుండిపోవడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

రిజర్వాయర్ పనుల్లో నిర్లిప్తత



దామలచెరువు సమీపంలో నిలిచిపోయిన నీటిశుద్ధి ట్యాంకులు

చిత్తూరు నగర వాసులకు ఒక టీఎంసీ తెలుగు గంగ నీటిని ఇవ్వడానికి 2018లో అడవిపల్లె రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొచ్చే ప్రతిపాదన మొదలైంది. అన్నమయ్య జిల్లాలోని కేవీ పల్లె మండలంలో అడవిపల్లె రిజర్వాయర్ ఉంది. ఇక్కడ 18 టీఎంసీ నీళ్లను ఒడిసి పట్టొచ్చు. అయితే దీనికి ప్రధాన ఆధారం వర్షం కాదు. హంద్రీ–నీవా ప్రధాన కాలువ నిర్మాణాలు పూర్తయితేనే అడవిపల్లెకు తెలుగుగంగ నుంచి నీళ్లు వచ్చి చేరుతాయి. ఈ పనులపై కూటమి సర్కారు దృష్టి సారించేంత సమయం చూపడంలేదు. ఇక అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరు నగరానికి నీళ్లు తీసుకురావాలనే లక్ష్యంలో రూ.250 కోట్లతో ఉన్న అంచనాలు ప్రస్తుతం రూ.271 కోట్లకు చేరుకుంది. ఈ మొత్తంలో కేంద్రం వాటా రూ.62.29 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.24.51 కోట్లు, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వాటాగా రూ.184 కోట్లు ఉంది. ఇందులో కేంద్రం అమృత్ 1.0 కింద రూ.46 కోట్లు విడుదల చేయగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్ర వాటాగా రూ.18 కోట్లు విడుదల చేశారు. ఇది కాకుండా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.104 కోట్లు అప్పు చేయగా, రూ.62 కోట్లు 14వ ఆర్థిక సంఘ నిధుల నుంచి భరించింది. అయినాసరే అడవిపల్లె రిజర్వాయర్ పనుల్లో నిర్లిప్తత నెలకొంది.

నీటిని తీసేసుకోండి..



అన్నమయ్య జిల్లా కేవీ పల్లెలోని అడవిపల్లె రిజర్వాయర్

ఆలూ లేదు.. చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగడు అన్న చందంగా అసలు చిత్తూరు నగరానికి చుక్క నీళ్లు ఇప్పటివరకు అడవిపల్లె రిజర్వాయర్ నుంచి అందనేలేదు. అడవిపల్లె రిజర్వాయర్ పనులు ఈ ఐదేళ్లల్లో పూర్తవడం సాధ్యమేనా అంటే? అన్నీ తెలిసిన అధికారులు దిక్కులు చూస్తున్నారు. హంద్రీ–నీవా పనులు ఎప్పుడు పూర్తవుతాయో? రిజర్వాయర్‌కు సమృద్ధిగా నీళ్లు రావడం, బావిని నిర్మించడం, ట్రీట్‌మెంట్‌ప్లాంట్ పూర్తి చేయడం, పైపులైన్లు వేయడం లాంటి భారీ పనులను పెండింగ్‌లో ఉన్నాయి. ఇది కాకుండా చిత్తూరు నగరంలో ఏషియన్ ఇన్‌ఫ్రా ఇన్వెస్టమెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) కింద రూ.36 కోట్లతో కైలాసపురం వద్ద రూ.16 లక్షల లీటర్ల నిల్వ చేసే ట్యాంకు నిర్మించాల్సి ఉంది. నగరంలో 60 కిలోమీటర్ల వరకు పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు కూడా పెండింగ్ ఉన్నాయి. బ్యాంకు నుంచి తీసుకున్న రూ.వంద కోట్ల అప్పునకు గానూ చిత్తూరు కార్పొరేషన్ నెలకు రూ.కోటి నెలసరి కంతు కట్టాల్సి ఉంది. అసలు చెల్లించకపోగా.. వడ్డీ కట్టడానికి నానా తిప్పలు పడుతోంది. ఈ విషయాలన్నీ తెలిసినా కూటమి సర్కారు అడవిపల్లె రిజర్వాయర్ నుంచి రోజుకు 0.785 టీఎంసీల నీళ్లను తీసుకోవచ్చంటూ ఈనెల 14వ తేదీన జీఓ విడుదల చేయడం నగర వాసుల చెవిలో పువ్వులు పెట్టడమే.

ఎంఎస్‌ఎంఈ సర్వే ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల) సర్వే జిల్లాలో శుక్రవారం ప్రారంభమైందని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ సర్వే ఫిబ్రవరి ఒకటో తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఎంఎస్‌ఎంఈల పనితీరు మెరుగుపరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే పథకాన్ని ప్రారంభించిందన్నారు. తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని పరిశ్రమలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చి ఏపీ ఎంఎస్‌ఎంఈ పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ నమోదు కాని వ్యాపారులను ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ సహకారంతో ఉద్యమ్, ఉద్యమ్ అసిస్ట్‌లో పేర్లు నమోదు చేయనున్నామన్నారు.

శుభ్రతతోనే డెంగీ నివారణ



డెంగీ ప్రబలిన ప్రాంతంలో నీటి డ్రమ్మును పరిశీలిస్తున్న మలేరియా అధికారి

నగరి : పరిశుభ్రతతోనే డెంగీ వ్యాధిని నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్, ఏకాంబర కుప్పం ప్రాంతాల్లో రెండు డెంగీ కేసులు నమోదు కావడంతో శుక్రవారం ఆయన ఆ ప్రాంతాలను పరిశీలించి, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. డెంగీ రావడానికి గల కారణాలపై ఆరా తీశారు. నివాసాల వద్ద ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడమే డెంగీ వ్యాప్తికి కారణంగా గుర్తించారు. లార్వా నివారణ మందులను సంబంధిత ప్రదేశాలలో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ ఇళ్లలో వాడే కుండీల్లోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలని సూచించారు. కాలువలకు అడ్డంగా రాళ్లను పెట్టడంతో నీరు నిల్వ ఉంటుందని, వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఎవరైనా కాలువలకు అడ్డంగా రాళ్లు, జాలీలు వంటివి పెడితే ఆ ఇంటి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని ప్రధాన వైద్యాధికారికి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామచంద్రారెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ శివమణి, హెల్త్‌సూపర్‌వైజర్ నారాయణ, హెల్త్‌అసిస్టెంట్ రవిచంద్రన్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధిలేక.. దాహం తీరక..

జలం జీవహేతువు. భూమిపై ఉన్న జీవరాశి మనుగడకు అదే ఇంధనం.. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నీరు అరక్షితంగా మారింది. గొంతులో పోసుకుంటే గరళమై రోగాలను అంటగడుతోంది. ఇలాంటి తరుణంలో పేదలకు సురక్షిత నీటిని అందించాలన్న ఆశయంతో గత వైఎస్సార్ సీపీ నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై అంతులేని అలక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా పేదలకు శుద్ధ జలం దూరం అవుతోంది. ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు రెచ్చిపోతున్నాయి.

రక్షితనీరు కరువాయే

- ఆర్వో ప్లాంట్లకు తాళం
- క్యాన్‌వాటర్ రూ.25కు కొనుగోలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం



పుంగనూరు కొత్తయిండ్లు ఎల్‌ఐసీ కాలనీలో ఆర్వో ప్లాంటుకు వేసిన తాళం



పుంగనూరు యాబీ కాంపౌండ్‌లో రక్షిత మంచినీరు తీసుకెళుతున్నజనం(ఫైల్)

పుంగనూరు: ప్రజలందరికీ సురక్షితమైన నీరు అందించాలన్న ఆశయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. పుంగనూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గ్రాంటు, ఎంపీ నిధులు, భాస్కర్ ట్రస్ట్ నిధులతో ప్రతి గ్రామంలోను రూ.లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు సైతం సురక్షితమైన నీటిని పంపిణీ చేయించారు. ఇందుకు కోసం సుమారు రూ.5.90 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుత కూటమి సర్కారు వీటికి మంగళం పాడింది. ఆర్వో ప్లాంట్లను మూసివేయడంతో ప్రజలు మంచినీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్వో ప్లాంట్లను మూసివేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు నిర్వహణ పీఎల్‌ఆర్ కంపెనీ

పుంగనూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నిర్వహణ, మరమ్మతులు, సిబ్బంది జీతభత్యాలను పీఎల్‌ఆర్ కంపెనీ చెల్లించేది. ఇది ఇలా ఉండగా ప్రభుత్వం వాటి నిర్వహణ, నీటి సరఫరా కార్యక్రమాలను చేపట్టకపోవడంతో వాటిని మూసివేశారు. దీని కారణంగా ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగం కావడంతో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్లాంట్లలో చోరీలు జరుగుతున్నాయి. యంత్రాలు సైతం తుప్పుపట్టే పరిస్థితి నెలకొంది. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మండలాల వారీగా

మున్సిపాలిటి	సంఖ్య	పని చేయనవి
పుంగనూరు	14	10
పుంగనూరు రూరల్	26	17
చౌడేపల్లె	19	10
సోమల	12	6
సదుం	17	2
పులిచెర్ల	16	7
రొంపిచెర్ల	14	9
మొత్తం	118	61

నాడు ఏర్పాటు.. నేడు మూత



పుంగనూరులో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

ఆర్వో ప్లాంట్లను రెండువేలు లీటర్ల సామర్థ్యంతో సుమారు ఒక్కొక్క ప్లాంట్‌ను రూ.5 లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ నీటిని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రజలకు సరఫరా చేశారు. గ్రామీణ పాంతాల్లో పంచాయతీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సుమారు మూడేళ్ల పాటు ప్రజలకు రక్షిత మంచినీటిని అందించగలిగారు. ప్రస్తుతం ప్లాంట్లు మూతపడ్డాయి.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి

గుడుపల్లె: బెంగళూరు– చెన్నై వెళ్లే రైలు మార్గంలో గుడుపల్లె రైల్వేగేటు వద్ద మునిరాజు(30) అనే వ్యక్తి శుక్రవారం రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మిట్టూరు గ్రామానికి చెందిన మునిరాజు పొరుగు ఊరికి వెళ్లడానికి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. గుడుపల్లె రైల్వేగేటు వద్ద చెట్ల పొదలు ఉండడంతో రైలు వస్తున్న విషయం గుర్తించకుండా పట్టాలు దాటాడు. ఆ సమయంలో రైలు వేగంగా వచ్చి అతడిని ఢీకొనడంతో మృతి చెందాడు. మృతి చెందిన వెంటనే అక్కడున్న గేట్ మెన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవాన్ని గుర్తించి బంధువులకు సమాచారం తెలిపి కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

గంగవరం: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. పలమనేరు– బెంగళూరు జాతీయ రహదారిలోని బార్డర్ చెక్‌పోస్టుకు సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు పట్టణంలోని పల్లె వీధికి చెందిన చంద్ర(27) సొంతపని నిమిత్తం ద్విచక్ర వాహనంలో నంగిళికి బయలుదేరాడు. మార్గం మధ్యలోని బార్డర్ చెక్‌పోస్టుకు సమీపంలో మసీదు ఎదురుగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడిని ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీవారి పట్టపురాణి







అశేష సంతోషిణి..జ్ఞానదాయని!

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం ఉదయం పెద్ద శేష వాహనంపై పరమపద వైకుంఠనాథుని అలంకరణలో అమ్మవారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీవారి ప్రియసఖి అయిన శ్రీ పద్మావతి అమ్మవారు హంస వాహనంపై వీణ చేతబట్టి సరస్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాకారులు పోటీలు పడిమరీ తమ ప్రతిభను చాటి భక్తులను ఆకట్టుకున్నారు. వాహన సేవల్లో తిరుమల పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వాములు, ఈఓ శ్యామలరావు, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, అర్చకుడు బాబు స్వామి పాల్గొన్నారు.

– చంద్రగిరి



హంస వాహనంపై సరస్వతీదేవి అలంకరణలో శ్రీపద్మావతి అమ్మవారు

వన్యప్రాణుల సంరక్షణ చర్యలు

చిత్తూరు కలెక్టరేట్: అటవీ ప్రాంతాల్లో ఏనుగులతో పాటు ఇతర వన్యప్రాణులు విద్యుత్ షాక్‌తో మరణించకుండా వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అటవీ, ఎస్పీడీసీఎల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. బంగారుపాళెం, పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజాణి, వి.కోట, పులిచెర్ల, కుప్పం మండలాల్లోని అటవీ ప్రాంతంలో 491 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయన్నారు. వీటి ద్వారా జంతువులకు ప్రాణహాని కలిగే అవకాశం ఉందన్నారు. అటవీ, విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకుని జంతువులు తిరగని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టాలన్నారు. ఇందుకోసం రెండు శాఖల అధికారులు సంయుక్త పరిశీలన చేసి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ భరణి, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్, టెక్నికల్ ఈఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్: డిసెంబర్ నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను శనివారం లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందుస్తుగా పింఛన్లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2,67,936 మంది లబ్ధిదారులకు పింఛన్ల ద్వారా రూ.113.31 కోట్లు అందజేయనున్నామన్నారు. శనివారం సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తారని చెప్పారు. లబ్ధిదారులందరూ ఇళ్ల వద్దనే ఉండి పింఛన్లు తీసుకోవాలన్నారు. సచివాలయ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. పెన్షన్ల పంపిణీ పకడ్బందీగా జరగాలని మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలో కమిషనర్లు పంపిణీ తీరును పర్యవేక్షించాలని ఆదేశించారు.

హలో.. గంజాయి ఎంత కావాలి..?

- పోలీసులకే గంజాయి విక్రయదారుడి ఆఫర్

చిత్తూరు అర్బన్: మీరు చదివింది నిజమే.. గంజాయి విక్రయించే ఓ పేరు మోసిన నిందితుడు పోలీసులకే సవాలు విసురుతూ ఎన్ని కిలోల గంజాయి కావాలని బేరం పెట్టాడు. చిత్తూరు టూటౌన్ పోలీసులు ఇటీవల రవితేజ అనే నిందితుడు గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. ఇతనికి గంజాయి సరఫరా చేసిన శరవణను, వెంకటేష్ అలియాస్ కుట్టి అనే నిందితులను పట్టుకోవడానికి గంజాయి కావాలన్నట్టు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ వలలో చిక్కుకున్న శవరణను అరెస్టు చేశారు. అయితే ప్రధానంగా గంజాయి సరఫరా చేస్తున్న కుట్టి అనే నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులే.. విక్రయదారుల అవతారమెత్తారు. కుట్టితో టూటౌన్ సీఐ నెట్టికంటయ్య ఫోన్‌లో గంజాయి కావాలని అడగ్గా, నిందితుడు కుట్టి ఎన్ని కిలోల గంజాయి కావాలని చెప్పండని అడగడంతో పోలీసు అధికారులు నోళ్లు వెల్లబెట్టారు. వీరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ ఇలా ఉంది.

సీఐ : హలో, కుట్టినా మాట్లాడేది.

కుట్టి : అవును. ఏం కావాలి..?

సీఐ : నా పేరు బాబు నా, నీ నంబర్ సంతపేట శరవణ దగ్గర తీసుకున్నా.. నాకు శీలావతి కావాలి.

కుట్టి : శీలావతా..? అదెవరు..?

సీఐ : అదేనయ్యా.. గంజాయి.

కుట్టి : మరి శీలావతి అంటావేమిటి..? గంజాయి అని అడుగు. ఎన్ని కిలోలు కావాలి.

సీఐ : అంటే కొద్దిగా ఎక్కువ కావాలి. కాలేజీల్లో పార్టీలు దొరికినాయి.

కుట్టి : నీకు ఇప్పటికిప్పుడు నూరు కిలోలు దింపేదా..? ఎన్ని కిలోలైనాఇస్తా. కిలో రూ.15 వేలు.

సీఐ : కిలో రేటు ఎక్కువగా ఉంది.. ఏదైనా తగ్గిస్తే.

కుట్టి : చూడు బాబు, నేను కిలో రూ.15 వేలుకు ఇస్తా. దాన్ని పొట్లాలు కట్టి అమ్మితే నీకు కిలోకు రూ.20 వేలు వస్తాది. రూపాయికి రూపాయి చాలదా.

సీఐ : సరేనా, దుడ్డు రెడీ చేసుకుని లైన్‌లోకి వస్తా.

కుట్టి : సరే, త్వరగా తీసుకో.. మళ్లీ స్టాక్ అయిపోతే వెయిట్ చేయాలి.

తీరా ఎలా తెలిసిందో ఏమో గానీ, తనకు చేసింది గంజాయి అమ్మేవాళ్లు కాదని పసిగట్టిన కుట్టి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. రవితేజ, శరవణకు గంజాయి విక్రయించినందుకు కుట్టిపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రెడ్డెప్ప




మొగసాల రెడ్డెప్పను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బైరెడ్డిపల్లె: వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా బైరెడ్డిపల్లె ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎంపీపీల సమావేశంలో ఈ మేరకు రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడిగా ఈయన కొనసాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన ఎంపీపీలు ఆయన్ని గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 80 శాతం మంది వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తూ అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు మూతపడిన ప్రభుత్వ వెబ్‌సైట్లు ఆరు నెలలు గడుస్తున్నా ఓపెన్ కావడం లేదన్నారు. దీంతో నూతనంగా మంజూరు కావాల్సిన రేషన్‌కార్డులు, పింఛన్లు, హెల్త్ కార్డులు, పెళ్లి కానుక తదితర పథకాలపై ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు పేదలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఎంతో నమ్మకంతో తమకు ఉన్నత పదవి ఇచ్చినందుకు పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామని మొగసాల రెడ్డెప్ప పేర్కొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తూ పరారీలో ఉన్న ఆర్.శరవణ (22) అనే నిందితుడ్ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. చిత్తూరులోని ఇరువారం వద్ద ఈనెల 12వ తేదీన గంజాయి విక్రయిస్తున్న రవితేజను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతనికి గంజాయి సరఫరా చేసిన సంతపేటకు చెందిన శరవణ అనే వ్యక్తి పారిపోవడంతో అతనిపై కేసు నమోదు చేశారు. అయితే తవణంపల్లె పరిధిలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన శరవణ, ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇతని కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు తిరుపతి–బెంగళూరు బైపాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశారు. కాగా ఇతనికి గంజాయి సరఫరా చేసే ప్రధాన నిందితుడు వెంకటేష్ అనే వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



క్రీడలతోనే వ్యక్తిత్వ వికాసం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

కాణిపాకం: క్రీడలతోనే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. పూతలపట్టు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల త్రోబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన బాలబాలికలు పాల్గొంటున్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా చిన్నారి భరతనాట్యం ఆకట్టుకుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని యువతలో చైతన్యాన్ని నింపేందుకు ఇలాంటి పోటీలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక పాల్గొన్నారు.

వరసిద్ధుడికి రూ.20.92 లక్షల ఆదాయం

కాణిపాకం: కాణిపాకంలోని షాపు, బంకు నిర్వహణకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన టెండర్ల ద్వారా వరసిద్ధి వినాయస్వామి దేవస్థానానికి రూ.20.92 లక్షల ఆదాయం వచ్చినట్లు ఏఈఓ రవీంద్రబాబు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని 27వ షాపునకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.16.80 లక్షలు, శ్రీ విఘ్నేశ్వర కల్యాణ మండపం వద్ద బంకుకు రూ.4.12 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈఓలు హరి మాధవరెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, సిబ్బంది బాల రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జె.శంకర్‌నాథ్ (43) అనే నిందితుడిని చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీహరి కథనం మేరకు.. ఎస్‌ఐ మోహన్‌కృష్ణ తన సిబ్బందితో కలిసి శుక్రవారం చిత్తూరు పాత బస్టాండ్‌లో తనిఖీలు చేశారు. కొంగారెడ్డిపల్లెకు చెంది న శంకర్‌నాథ్ వద్ద ఏడు కర్ణాటక మద్యం సీసాలు ఉండగా గుర్తించి, వాటిని సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. సిబ్బంది శరవణ, దామోదర, ప్రసన్న పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేనులో గురువారం రాత్రి పంటలపై ఏనుగులు దాడి చేశాయని బాధిత రైతులు వాపోయారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు పంట పొలాలపై దాడి చేశాయన్నారు. గ్రామానికి చెందిన రైతులు శంకర్, రవి, కాశయ్య, మహాలింగం, సుందరం, ఢిల్లీబాబు, పిచ్చాండి, మణి, గోవిందస్వామి, సుబ్బయ్యకు చెందిన వరి, రాగి పంటలను తొక్కివేశాయన్నారు. ఏనుగుల దాడిలో పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

గంగవరం: ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన గంగవరం ఫ్లైవోవర్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మంగళమ్మ(54) కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స చేసుకునేందుకు గ్రామం నుంచి పలమనేరుకు ఆటోలో బయలుదేరింది. డ్రైవర్, ఇద్దరు ప్రయాణికులతో వెళుతున్న ఆటో గంగవరం ఫ్లైఓవర్ స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంగళమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్షవాతం మందు కోసం వెళుతూ..

- బోలెరో, ఐషర్ ఢీ.. ఐదుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం






క్షతగాత్రులు

పుంగనూరు: పక్షవాతంతో బాధపడుతూ పలమనేరు సమీపంలోని విరూపాక్షిపురంలో మందు తీసుకోవడానికి వెళుతున్న ఓ కుటుంబం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని ఈడిగపల్లె వద్ద జరిగింది. ప్రొద్దుటూరుకు చెందిన రామమూర్తి(60) పక్షవాతంతో బాధపడుతుండగా విరూపాక్షిపురంలో మందులు వేసుకునేందుకు బయలుదేరారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు కాశమ్మ(55), వెంకటసుబ్బయ్య(53), లక్ష్మీపతి(50), సరోజమ్మ(45) బోలోరా జీపులో విరూపాక్షిపురానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఈడిగపల్లె వద్ద అర్ధరాత్రి ఒంటి గంటకు వెళుతుండగా ముందుగా వెళుతున్న ఐషర్‌లారీ రోడ్డుపై అకస్మాత్తుగా ఆపడంతో వెనుక ఉన్న బోలెరో దాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామమూర్తితో పాటు జీపులో ప్రయాణిస్తున్న వారందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం గమనించిన ఆప్రాంత వాసులు 108కు సమాచారం అందించారు. బాధితులను 108లో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మా కడుపు కొట్టారు!

పలమనేరు: బోయకొండలో తమ దుకాణాలను పక్కాభవనాలు ఇస్తామని చెప్పి, గతంలో కూల్చివేశారని, ఇప్పుడు తమకు కాకుంటా అధికార పార్టీ వారికి షాపులను కేటాయించి తమ కడుపు కొట్టారని పలువురు చిరువ్యాపారులు శుక్రవారం ఆర్డీఓ భవానికి విన్నవించారు. గతంలో తాము చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉండేవారమన్నారు. ఉయితే తమ దుకాణాలను గతంలో తొలగించారని, వాటి స్థానంలో కొత్త దుకాణాలను కట్టి తమకే కేటాయిస్తామని చెప్పారన్నారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అండతో కొందరు ఆ దుకాణాలను తమకు కేటాయించకుండా వారికి ఇష్టమైన వారికి ఎక్కువగా డిపాజిట్లు తీసుకుని ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ అక్కడ జరుతున్న వ్యవహారంపై తాను విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. వీరికి సీపీఎం నాయకుడు ఓబులురాజు మద్దతు పలికారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బోయకొండ, గంగాపురానికి చెందిన చిరు వ్యాపారులు జయప్ప, రెడ్డెప్ప, హరి, గణేష్, సీతమ్మ, రమణ ఉన్నారు.

స్మార్ట్‌లాక్ ఉపయోగించండి



స్మార్ట్ లాక్‌లను పంపిణీ చేస్తున్న సీఐ నెట్టికంటయ్య

చిత్తూరు అర్బన్: నివాసాలు, ప్రార్థనా మందిరాల్లో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్త కోసం స్మార్ట్ లాక్‌లను ఉపయోగించాలని చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కోరారు. శుక్రవారం స్టేషన్ ఆవరణలో పలు ప్రార్థనా మందిరాలకు చెందిన నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చోరీలు జరిగిన తరువాత పోలీసులను ఆశ్రయించడం కన్నా, చోరీ జరగకముందే జాగ్రత్త వహించాలన్నారు. మార్కెట్‌లో రూ.600 విలువ చేసే స్మార్ట్‌లాక్ పరికరాన్ని రూ.400కు తెప్పించామని.. దీన్ని ప్రార్థనా మందిరాలతో పాటు ఇళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు కూడా ఉపయోగించవచ్చన్నారు. ఎవరైనా లాక్ తీయడానికి వస్తే అలారమ్ శబ్దం చేయడంతో చుట్టు పక్కల ఉన్న వాళ్లంతా వచ్చేస్తారన్నారు. ఈ భయంతో దొంగతనాలు తగ్గే అవకాశం ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఈ లాక్‌లను అందుబాటులో ఉంచామని, ఎవరు వచ్చి అడిగినా ఇస్తామన్నారు. ముందస్తు జాగ్రత్తల వల్లే చోరీలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.